
ప్రజాశక్తి
శనివారం 1 నవంబర్ 2025



ఆసుపత్రిలో గిరిజన విద్యార్థికి అవస్థలు

ప్రజాశక్తి-పార్వతీపురం

కురుపాం మండలం నీలకంఠాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో నాలుగో తరగతి చదువుతున్న విద్యార్థిని మండంగి హారతి జిల్లా కేంద్ర ఆసుపత్రిలో గత ఐదు రోజులుగా బాధపడుతున్నట్లు తెలుస్తోంది. జ్వరంతో బాధపడుతున్న హారతిని గుమ్మలక్ష్మీపురం సిహెచ్‌సిలో చేర్పించారు. మెరుగైన చికిత్స కోసం పార్వతీపురం జిల్లా కేంద్ర ఆసుపత్రికి రిఫర్ చేశారు. అయితే 5 రోజులుగా ఆమె ఆసుపత్రిలో కడుపు నొప్పితో బాధపడుతున్నట్లు ఆమె బంధువులు తెలిపారు. ఆరోగ్యశ్రీ కార్డులో హారతి పేరు లేదని ఆసుపత్రిలో స్కాన్ చేయడం లేదని చెప్పారు. దీనిపై సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగు నాయుడు మాట్లాడుతూ బాలిక తల్లిదండ్రులు సమస్యను తన దృష్టికి తీసుకొచ్చారని, జిల్లా అధికారులు ఆమెకు స్కానింగ్ చేసి చికిత్స అందించాలని కోరారు.

అధిక వర్షాలతో.. దెబ్బతిన్న మొక్కజొన్న, పత్తి

- ఇప్పటికే తగ్గిన దిగుబడి
- అరటి, కందపైనా తీవ్ర ప్రభావం
- నష్టపోయామంటూ రైతుల ఆవేదన

గడచిన నెల రోజులుగా కురుస్తున్న వర్షాలకు మొంథా తుపాను తోడవ్వడంతో మొక్కజొన్న, పత్తి రైతులు తీవ్రంగా నష్టపోయారు. అరటి, కంద పంటలు కూడా దెబ్బతిన్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో ఎప్పటికప్పుడు కొనుగోలు చేసేందుకు ప్రయత్నించాల్సిన అధికార యంత్రాంగం ఇంకా మీనమేషాలు లెక్కిస్తోంది. అరటి, బొప్పాయి గత నెలలో వీచిన గాలులకు వందలాది ఎకరాల్లో నేలమట్టమయ్యాయి. తాజాగా వచ్చిన తుపాను గాలులకు చిగురుటాకుల్లా ఊగిపోయాయి. మూడు నెలలుగా వర్షాల ప్రభావం కంద, పసుపు పంటలపైనా ఉంటుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి/సాలూరు

ఉమ్మడి విజయనగరం జిల్లాలో వరి తరువాత స్థాయిలో మొక్కజొన్న, పత్తి పంటలు సాగువుతున్నాయి. ఈఏడాది విజయనగరం జిల్లాలో 24,947 ఎకరాలు, మన్యం జిల్లాలో 15,029 ఎకరాలు చొప్పున మొత్తం ఉమ్మడి జిల్లాలో సుమారు 35వేల ఎకరాల మేర మొక్కజొన్న సాగైంది. సీజన్ ప్రారంభం నుంచీ వర్షాలు పడుతునే ఉన్న విషయం విధితమే. ముఖ్యంగా గత నెలలోనే మొక్కజొన్న గింజ కడుతున్న సమయంలో ఎడతెరిపిలేని వర్షాలు దిగుబడి తీవ్ర ప్రభావం చూపాయి. పది రోజులుగా కోతలు సాగుతున్నాయి. కోసినచోట గింజలను ఎండబెట్టేందుకు అవకాశం లేకుండా పోయింది. సాలూరు, మక్కువ, పాచిపెంట ప్రాంతాల్లో టార్పాణాలు అద్దెకు తీసుకుని రోడ్లపై ఎండబెట్టినప్పటికీ, వర్షాలు తెరుపు ఇవ్వకపోవడం వల్ల ప్రయోజనం లేకపోతోంది. ఇటు పూసపాటిరేగ, చీపురుపల్లి తదితర మండలాల్లోనూ ఇదే పరిస్థితి కనిపిస్తోంది. గతంలో ఎకరాకు 1600 కేజీల నుంచి 200కేజీలు దిగుబడి కాగా, వర్షాల కారణంగా 40నుంచి 50శాతం దిగుబడి తగ్గిపోయిందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు తుపాను వల్ల మూడు రోజులుగా మొక్కజొన్న కోతలు కూడా నిలిచిపోయాయి.

పత్తి విషయానికి వస్తే.... విజయనగరం జిల్లాలో 5,818 ఎకరాల్లోనూ, మన్యం జిల్లాలో 16,706 ఎకరాల్లోనూ సాగయ్యింది. ఇప్పటికే దాదాపు అన్ని ప్రాంతాల్లోనూ పత్తి ఏరివేత ప్రారంభమైంది. కానీ, కాయకట్టే దశనుంచీ రోజూ వర్షాలు కురవడం, పువ్వు వికసించే సమయంలోనూ వర్షాలు తెరుపు ఇవ్వకపోవడం వంటి పరిస్థితుల వల్ల దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపింది. తుపానుతో పత్తి పూర్తిగా దెబ్బతింది. నెలరోజుల క్రితమే పత్తి ఏరివేత ప్రారంభమైనప్పటికీ ఎండబెట్టేందుకు అవకాశం కుదరలేదు. గతంలో మార్చి నెలాఖరు వరకు సుమారు ఆరు నుంచి పది దఫాలు పత్తి ఏరేవారమని, ఈసారి రెండు కోతలతో ఇప్పటికే ఆఖరి అయ్యాయని సాలూరు మండలం తోణాం, మరుపల్లి, మామిడిపల్లి గ్రామాలకు చెందిన రైతులు ప్రజాశక్తి ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. కోచిన పత్తి కూడా నాణ్యత ప్రశ్నార్థకంగా ఉందంటూ మరికొంతమంది లబోదిబోమంటున్నారు. ముఖ్యంగా మన్యం జిల్లాలో సాలూరు, మక్కువ, పాచిపెంట, అటు కురుపాం, జియ్యమ్మవలస మండలాల్లో గత నెలరోజులుగా బీభత్సంగా వీచిన గాలులకు అరటిచెట్లు వందలాది ఎకరాల్లో నేలకొరిగాయి. నాటిన నుంచి భూమిలో ఉష్ణోగ్రతలు చాలా తక్కువగా ఉండడంతో ఈ ఏడాది దిగుబడి చాలా తక్కువగా ఉంటాయంటూ సాలూరు, మక్కువ ప్రాంతాల్లో సాగుచేస్తున్న కంద, పసుపు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పెట్టుబడి కూడా రాదు



ఈ ఏడాది మొక్కజొన్న సాగులో పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు. ఎకరాకు రూ.30వేల చొప్పున మూడు ఎకరాలకు రూ.90వేల పెట్టుబడి అయ్యింది. కానీ, మొక్క మొలిసింది మొదలు ఇప్పటి వరకు వర్షాలు కురుస్తునే ఉన్నాయి. కీలకమైన దశలో కూడా వర్షాలు తగ్గుముఖం పట్టకపోవడంతో 50 శాతం దిగుబడి తగ్గిపోయింది. పోని, వచ్చిన దిగుబడికైనా మద్ధతు ధర వస్తుందంటే గింజలు ఎండబెట్టుకోవడానికి కూడా అవకాశం లేకుండా పోయింది. తేమ శాతం పేరుతో కొనుగోలుదారులు ఇంకెంత కోత పెడతారో...!

పూజారి శ్రీనివాసరావు, రైతు, మామిడిపల్లి, సాలూరు మండలం

ఆదివాసీల హక్కులు, చట్టాల రక్షణకు పోరాటం

ప్రజాశక్తి - కురుపాం

శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాట యోధులు కోరన్న, మంగన్న స్ఫూర్తితో ఆదివాసీ హక్కులు, చట్టాలను కాపాడుకోవడానికి గిరిజన యువత ఉద్యమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు పిలుపునిచ్చారు. కోరన్న, మంగన్న 58వ వర్ధంతి వేడుకలు మండలంలోని నీలకంఠాపురం పంచాయతీ మామిడి మానుగూడలో ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు బిడ్డిక వెంకటరావు అధ్యక్షతన శుక్రవారం జరిగాయి. తొలుత గ్రామంలో డప్పు, మేళతాళాలు, కళాకారులను నృత్యాలతో ర్యాలీగా కోరన్న, మంగన్న అమరవీరుల స్థూపం వద్దకు వెళ్లి జెండాను ఆవిష్కరించి స్థూపాలకు పూలదండలు వేసి నివాళ్లు అర్పించారు. అనంతరం జరిగిన సభలో గంగునాయుడు మాట్లాడుతూ కోరన్న, మంగన్న 1967లో ఐదో గిరిజన సంఘం మహాసభకు హాజరవుతుండగా లేవిడి వద్ద గిరిజన మహిళలను అల్లరి పెడుతున్న భూస్వాములను అడ్డుకోవడానికి ప్రయత్నించగా, పోలీసుల వద్ద ఉన్న తుపాకీ తీసుకొని ఆ భూస్వాములను కోరన్న మంగన్న కాల్చి చంపారని, వారి త్యాగాల ఫలితంగానే ఈ ప్రాంతంలో గిరిజనులకు భూములు దక్కాయని అన్నారు. అలాగే 1/70 చట్టం, జీవో 3, ఆశ్రమ పాఠశాలలు, పిహెచ్‌సిలు, రోడ్లు , జిసిసిలు అన్ని ఏర్పడ్డాయని తెలిపారు. ఇప్పుడున్న ప్రభుత్వాలు శ్రీకాకుళ గిరిజన రైతాంగ పోరాట ఫలితాలను పూర్తిగా కాలరాయడానికి ప్రయత్నం చేస్తున్నాయని విమర్శించారు. గిరిజన ప్రాంతాలను మైనింగ్, హైడ్రోపవర్ ప్రాజెక్టుల పేరుతో కార్పొరేట్లకు అప్పజెప్పడానికి చూస్తున్నారని, అందుకనే 1/70చట్టాన్ని, అటవీ హక్కుల చట్టాన్ని సక్రమంగా అమలు చేయడం లేదని తెలిపారు. గిరిజనులు సాగు చేస్తున్న భూములకు పూర్తిస్థాయి పట్టాలు ఇవ్వడం లేదని, పట్టా లేని భూముల్లో అటవీ శాఖ అధికారులు గిరిజనులు ఇబ్బందులను గురి చేస్తున్నారని, కావున కోరన్న, మంగన్న పోరాట స్ఫూర్తితో గిరిజనుల హక్కులు, చట్టాలు కాపాడుకోవాలని గిరిజన యువతకు పిలుపునిచ్చారు. గిరిజన సంఘ నాయకులు, కురుపాం వైస్ ఎంపిపి అన్నాజీ రావు మాట్లాడుతూ గిరిజన సంఘం నాయకత్వంలో పోరాడి సాధించుకున్న హక్కులను నేటి ప్రభుత్వాలు కాలరాస్తున్నాయని విమర్శించారు. ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతిరావు మాట్లాడుతూ సీతంపేట, కురుపాం ఏజెన్సీలో గిరిజనుల హక్కుల కోసం పల్లెరక రాములు, ఆదిభట్ల కైలాసం, వెంపటాపు సత్యం ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఉండి గిరిజనులను చైతన్యవంతం చేసి అనేక పోరాటాలు చేశారని, ఈ ప్రాంతంలోని పెత్తందారులంతా గిరిజనులను దోచుకున్నారని అన్నారు. మళ్లీ అలాంటి రోజులు తీసుకురావడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తుందన్నారు. అందులో భాగంగానే గిరిజనులకు విద్య అందనివ్వకుండా చేస్తుందని, మొత్తం ప్రైవేటీకరణ చేసి గిరిజన యువతకు ఉద్యోగాలు రాకుండా చేస్తుందని అన్నారు. జీవో 3ను రద్దు చేశారని, దాని స్థానంలో మరో చట్టం తెస్తామని చెప్పిన చంద్రబాబునాయుడు ఇంతవరకూ తేల్చలేదన్నారు. మెగా డీఎస్సీ స్థానంలో స్పెషల్ డిఎస్సి తీసుకొచ్చి గిరిజన ప్రాంతంలో ఉన్న ఉపాధ్యాయ పోస్టులు మొత్తం గిరిజనులకు ఇవ్వాలని గిరిజన యువత పోరాటం చేస్తున్నా చంద్రబాబు, పవన్‌కల్యాణ్ కనీసం పట్టించుకోవడంలేదని అన్నారు ఇప్పటికైనా గిరిజనులంతా కోరన్న, మంగన్న స్ఫూర్తితో పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయ కులు మండంగి అడ్డమేశ్వరరావు, కద్రక రామస్వామి, మండంగి శ్రీనివాసరావు, మండంగి లక్ష్మణరావు, ఉలక వాసుదేవ రావు, కోరంగి సీతారాం చుట్టుపక్కల గిరిజన గ్రామాల యువత, మహిళలు పాల్గొన్నారు.



అమరవీరుల స్థూపం వద్ద నివాళు అర్పిస్తున్న నాయకులు



మాట్లాడుతున్న గంగునాయుడు

కోరన్న మంగన్న వర్ధంతి సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు



భారీ ర్యాలీగా అమరవీరుల స్తూపం వద్దకు వెళ్తున్న నాయకులు, గిరిజనులు

గుమ్మలక్ష్మీపురం : కోరన్న, మంగన్న ఆశయ సాధనకు కృషి చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కోశాధికారి ఎం.రమణ పిలుపునిచ్చారు. కోరన్న, మంగన్న 58వ వర్ధంతి సందర్భంగా గుమ్మలక్ష్మీపురంలోని వారి స్థూపం వద్ద జెండా ఎగరవేసి నివాళు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గిరిజనుల వెట్టిచాకిరి విముక్తి కోసం, చట్టాలు, హక్కుల కోసం కోరన్న మంగన్న పోరాటం చేశారని గుర్తు చేశారు. వీరి ఆశయాలకు అనుగుణంగా నేటి గిరిజన యువత పోరాటాలు చేసి హక్కులు, చట్టాలను రక్షించుకునేందుకు ముందుకు రావాలన్నారు. సిఐటియు మండల కార్యదర్శి గౌరీ శంకర్రావు, పలువురు గిరిజనులు, అభిమానులు పాల్గొన్నారు.

కొమరాడ : మండలంలోని కుమ్మరి గుంట పంచాయతీ డంగభద్రలో కోరన్న, మంగన్న వర్ధంతి సభ గిరిజన సంఘం మండల నాయకులు హిమరిక రామారావు ఆధ్వర్యాన జరిగింది. కోరన్న, మంగన్న పోరాట స్ఫూర్తితో గిరిజన హక్కులు, చట్టాలు కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గిరిజన సంఘం నాయకులు రాజేశ్వరమ్మ రవణమ్మ గౌరమ్మ భాస్కరరావు గంగరాజు వెంకట్రావు శంకర్రావు విద్యార్థులు పాల్గొన్నారు.

పార్వతీపురం: గిరిజన హక్కుల కోసం పోరాటం చేసిన వీరులు కోరన్న, మంగన్న ల త్యాగాల స్ఫూర్తి తో గిరిజన హక్కుల పరిరక్షణ కోసం పోరాటాలు చేయాలని గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర ప్రధాన కార్యదర్శి పాలక రంజిత్ కుమార్ పిలుపునిచ్చారు. పార్వతీపురం మండలం బొడ్డవలసలో కోరన్న, మంగన్న వర్ధంతి సభ గిరిజన సంక్షేమ సంఘం ఉత్తరాంధ్ర అధ్యక్షులు తాడంగి సాయిబాబు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రంజిత్‌కుమార్ మాట్లాడుతూ కోరన్న, మంగన్న ప్రాణ త్యాగాలతో సాధించిన గిరిజన హక్కుల పరిరక్షణకు మరో గిరిజన పోరాటం అవసరమన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు,యువత పాల్గొన్నారు.

బాధితులకు చెక్కులు అందజేత

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ పార్శిల్ కౌంటర్ వద్ద అక్టోబరు 19న దీపావళి సామగ్రి పేలుడు చోటు చేసుకున్న ఘటనలో బాధితులకు ఆర్థిక సహాయంగా ప్రభుత్వం అందించిన సాయం చెక్కులను స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయ్‌చంద్ర శుక్రవారం పంపిణీ చేశారు. బాధితులు రెడ్డి రమేష్‌కు రూ.5 లక్షలు, కె.రమేష్‌కు రూ.4 లక్షలు, డ్రైవరు టి.రవికి రూ.50 వేలు, బి.సుందర్రావుకు రూ.25 వేలు చొప్పున వారి ఇళ్లకు వెళ్లి ఆర్థిక సాయం చెక్కులను ఎమ్మెల్యే విజయ్ చంద్ర అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడి బాధితుల ఆరోగ్యపరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులు పరిహారం అందించిన సిఎం చంద్రబాబు, ఎమ్మెల్యే బోనెల విజయచంద్రకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌టిసి అధికారులు, టిడిపి నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ : జెసి

పార్వతీపురం : గిరిజన సంక్షేమ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన ఛాంబరులో విద్యార్థులు ఆరోగ్యంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు ఎటువంటి అనారోగ్య సమస్యలు లేకుండా చూడాలన్నారు. ప్రతి రోజూ విద్యార్థులను గమనిస్తూ ఉండాలని, అనుమానం ఉంటే వెంటనే వైద్యుడ్ని పిలిపించి చికిత్స అందించాలని సూచించారు. అనారోగ్యానికి గురైన విద్యార్థులు సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండే వరకు వారిపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని తెలిపారు. పిల్లల్లో రోగ నిరోధక శక్తి పెరిగేలా చూడాలన్నారు. యోగా, క్రీడలు నిర్వహించాలని, తద్వారా ఆత్మవిశ్వాసం, నూతన ఉత్తేజం పెంపొందుతుందని పేర్కొన్నారు. అంతకుముందు డిఎస్సీ ద్వారా నియమించబడిన గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులకు ఏర్పాటు చేసిన ఓరియేంటేషన్ ప్రోగ్రాంలో జెసి పాల్గొని పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఐటిడిఎ ఎపిఒ ఎ.మురళీధర్, గిరిజన సంక్షేమ శాఖ డిడి ఎ.విజయశాంతి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పర్యాటకాభివృద్ధితో జిల్లాకు ప్రత్యేక స్థానం

జలపాతాల జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యం : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా అనేక జలపాతాలు ఈ జిల్లాలో ఉన్నాయని, వాటన్నింటిని అభివృద్ధి చేసుకుంటూ జలపాతాల జిల్లాగా తీర్చిదిద్దడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్.ప్రభాకర రెడ్డి అన్నారు. పర్యాటక రంగంలో జిల్లాకు ప్రత్యేక స్థానం కల్పించడమే సంకల్పమని కలెక్టర్ వెల్లడించారు. ఆయన ఛాంబరులో పర్యాటక ప్రాంతాల అభివృద్ధిపై శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నవంబర్ 1న సీతంపేట ఎన్‌టిఆర్ పార్కులో విహంగ వీక్షణం చేద్దాం, మన్యం అందాలను తిలకిద్దాం అన్న కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రులు, ప్రజా ప్రతినిధులు చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు చెప్పారు. కొత్తదనంతో మెట్టు గూడ జలపాతం ప్రారంభించుకోనున్నట్లు వివరించారు. అక్టోబర్ నుంచి ఫిబ్రవరి వరకు గల సీజనులో ప్రకృతి అందాలను పర్యాటకులకు పరిచయం చేయనున్నట్లు వివరించారు. సీతంపేట ఎన్‌టిఆర్ అడ్వంచర్ పార్కులో ప్రప్రథమంగా హాట్ ఎయిర్ బెలూన్ అందుబాటులోకి తెచ్చామని, కొత్తగా సెల్ఫీ పాయింట్, షూటింగులకు అనుకూలంగా ఉండేలా ప్రదేశాలను తీర్చిదిద్దినట్టు తెలిపారు. త్వరలో ఫ్లవర్ గార్డెన్‌ను కూడా పర్యాటకులకు అందుబాటులోకి తీసుకురానున్నామని చెప్పారు. మెట్టుగూడ జలపాతం వద్ద పిల్లల కోసం సహజసిద్ధమైన స్విమ్మింగ్ పూల్‌ను ఏర్పాటు చేశామన్నారు. పర్యాటకుల అవసరమైన స్టాళ్లను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ఇందులో దివ్యాంగులకు, మహిళలకు, యువతకు అధిక ప్రాధాన్యతను ఇవ్వనున్నట్లు చెప్పారు. పర్యాటకులకు ధరలు అందుబాటులో ఉండేలా నిర్ణయిస్తూ వాటిని పర్యాటకుల సందర్శనార్ధం పెడుతున్నట్లు చెప్పారు. సమావేశంలో జెసి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్ పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

విదేశాల్లో ఉద్యోగాలకు దరఖాస్తులు ఆహ్వానం

సీతంపేట : ఖత్తర్, జర్మనీ దేశాల్లో ఉద్యోగాలు పొందేందుకు నవంబర్ 6లోగా appssdc.in వెబ్ సైట్ కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా నైపుణ్య అధికారి సాయి శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు ఐటిఐ డిప్లొమా ఉంటే సరిపోతుందన్నారు. మరిన్ని వివరాలకు సీతంపేట వైటిసి ఫోన్ నెంబర్ 7032060773ను సంప్రదించాలని కోరారు.

పలు గ్రామాల్లో సబ్ కలెక్టర్ పర్యటన

పార్వతీపురం : ఇళ్ల స్థలాల కోసం దరఖాస్తు చేసుకున్న దరఖాస్తుదారులను సబ్ కలెక్టర్ ఆర్.వైశాలి క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వాస్తవాలను తెలుసుకునే దిశలో భాగంగా మండలంలోని గోపాలపురం, అడ్డాపుశిల, పిన్నింటి రామినాయుడువలసలో శుక్రవారం ఆమె పర్యటించారు. దరఖాస్తుదారులతో నేరుగా మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి

ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బంటు దాసు

ప్రజాశక్తి - పార్వతీపురం

మొంథా తుఫాన్ కారణంగా నష్టపోయిన పంటలకు ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించి, రైతులను ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా కార్యదర్శి బంటు దాసు డిమాండ్ చేశారు. శుక్రవారం పార్వతీపురం, కొమరాడ మండలాల్లో గల జిఎంఆర్‌సి గ్రామాలైన నిమ్మలపాడు, బెతలపాడు, బట్టలభద్ర, దలైపేట, గుంపు, రాయపురం గ్రామాల్లో ఎపి రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎం.ఉపేంద్ర, నాయకులు దత్తి పురుషోత్తంతో కలిసి పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా బంటు దాసు మాట్లాడుతూ పత్తి చేతికి వచ్చే సమయంలో తుఫానుకు కారణంగా పత్తి కాయలు నల్లగా రంగు మారిపోయి పత్తి బయటకు రాకుండా పోయిందని పేర్కొన్నారు. దీంతో నష్టపోయామని రైతులు తీవ్ర ఆవేదనకు గురవుతున్నారని, వెంటనే ప్రభుత్వం కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సంస్థ రంగుమారినా, మొలకెత్తిన పత్తి మొత్తాన్ని కొనుగోలు చేపట్టాలని డిమాండ్ చేశారు. అలాగే క్యాబేజీ పంట మొత్తం నష్టం వాటిలిందన్నారు. నారాయణపురంలో కూరగాయలు పండించే రైతులు లబోదిబోమంటున్నారన్నారు. అలాగే కల్లికోట, బిత్తరపాడు రైతుల పరిస్థితి ఇదేనని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా పంట నష్టం అంచనా వేసి ఆయా వివరాలను గ్రామ సచివాలయాల్లో ప్రకటించాలని డిమాండ్ చేశారు. లేకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

కొమరాడ: ఒకవైపు ఏనుగులు, మరోవైపు వరుస తుఫాన్లుతో పూర్తిస్థాయిలో చేతికి అందిన పంటలు నేల పాలవడంతో దివాళి తీసిన రైతన్నలను ఆదుకోవాలని సిపిఎం నాయకులు కొల్లి సాంబమూర్తి డిమాండ్ చేశారు. ఈమేరకు స్థానిక తహశీల్దార్ సత్యనారాయణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. భారీ వర్షాలకు వరి, పత్తి, మొక్కజొన్న, టమాట, బొప్పాయి, అరటి, జీడి వంటి పంటలతో పాటు పార్వతీపురం నుండి కూనేరు మీదుగా మూడు రాష్ట్రాలకెళ్లే రోడ్డు గొయ్యిలై నీటితో నిండిపోయిందన్నారు. దీంతో వాహనదారులు ఈ గొయ్యిలో పడి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితి ఉందనీ అన్నారు.



నష్టపరిహారం సంబంధించిన డబ్బులు అకౌంట్లో వెంటనే వేసి రైతులకు భరోసా కల్పించాలని, లేనిచో సిపిఎం ఆధ్వర్యంలో పెద్దఎత్తున ఆందోళన చేపడుతామని తెలిపారు. కార్యక్రమంలో గిరిజన సంఘ నాయకులు అప్పారావు,రైతులు గోవింద వెంకటరావు సుబ్బారావు పాల్గొన్నారు.

నీట మునిగి పంటలను పరిశీలించిన సిపిఎం బృందం

సీతానగరం : రైతులు, కౌలు రైతుల అసాధారణ నష్టాన్ని అన్ని గ్రామాల అధికారులు పరిశీలించి నష్టపరిహారాన్ని అందించాలని సిపిఎం నాయకులు రెడ్డి వేణు, ఆర్.రాము, జి.వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని ఇప్పలవలసలో తుపాను వల్ల నష్ట పోయిన వరిపంటలను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా రెడ్డి వేణు మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో కౌలు తీవ్రంగా నష్టపోయారన్నారు. కావున ప్రభుత్వం రైతులు, కౌలురైతులకు ఎకరాకు రూ.25 వేలు చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. గుర్తింపు కార్డులతో నిమిత్తం లేకుండా గ్రామ సభల ద్వారా కౌలుదార్లను గుర్తించి పూర్తి పరిహారం వారికే ఇవ్వాలని కోరారు. మిగిలిన, వాణిజ్య, కూరగాయల పంటలకు నష్టం వాటిల్లిందని, వీటికి ఎకరాకు రూ.50 వేలు చొప్పున పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఘనంగా పటేల్ జయంతి వేడుకలు

ప్రజాశక్తి - పార్వతీపురం

భారత మాజీ ఉప ప్రధాని, మాజీ కేంద్ర హెూం శాఖ మంత్రి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకలు శుక్రవారం కలెక్టరేట్లో ఘనంగా జరిగాయి. ఈ వేడుకల్లో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి, ఎస్‌పి ఎస్‌వి మాధవ్ రెడ్డి హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి, పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత తొలి హెూం శాఖ మంత్రిగా, ఉప ప్రధానిగా పనిచేసిన ఉక్కుమనిషి సర్దార్ వల్లభభాయ్ పటేల్ అని కొనియాడారు. కార్యక్రమంలో జెసి సి.యశ్వంత్ కుమార్ రెడ్డి, డిఆర్‌ఒ కె.హేమలత, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్ పటేల్ చిత్ర పటానికి పూలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.



పటేల్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కలెక్టర్ ప్రభాకర్‌రెడ్డి

విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో....

ఏక్తా దివస్‌లో భాగంగా స్థానిక విద్యుత్ సర్కిల్ కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎపిఇపిడిసిఎల్ ఎస్‌ఇ కె.మల్లికార్జు నరావు, కార్యాలయం ఎఒ శ్రీనివాస్, ఎఎఒ కె.జయరాజ్, పిఒ శ్రీనివాస్, డిఇలు, ఎఇలు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో....

పార్వతీపురం టౌన్: జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని జాతీయ సమైఖ్యత దినం గా పరిగణించి, జిల్లా పోలీసుశాఖ ఆధ్వర్యంలో రన్ ఫర్ యూనిటీ ను శుక్రవారం ఉదయం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్పీ ఎస్.వి.మాధవ్ రెడ్డి, "రన్ ఫర్ యూనిటీ"ను జెండా ఊపి ప్రారంభించారు. పట్టణంలోని ఆర్టిసి కూడలి నుండి జిల్లా పోలీస్ కార్యాలయం వరకు సాగిన ఈ రన్ ఫర్ యూనిటీలో ఎస్పీ పోలీస్ అధికారులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు. రన్‌లో పాల్గొన్న వారందరిచే ఎస్పీ ప్రతిజ్ఞను చేయించారు. అనంతరం పట్టణంలోని ఆర్టిసి కూడలి నుండి మొదలై జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద ముగిసిన పరుగు లో పాల్గొని విజేతలుగా నిల్చిన ఆరుగురికి బహుమతులను అందచేశారు. కార్యక్రమంలో ఎఆర్ డిఎస్పీ థామస్ రెడ్డి, ఎస్‌బి సిఐ రమణమూర్తి, పట్టణ, రూరల్ సిఐలు మురళీధర్, రంఘనాథం, ఎఆర్ ఆర్‌ఐ రాంబాబు, ఆర్ఎస్సైలు, ఎస్‌ఐలు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాల రవాణాను అరికట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో మాదక ద్రవ్యాలు, మత్తు పదార్ధాల అక్రమ రవాణాను పూర్తిగా అరికట్టాలని జిల్లా కలెక్టర్ డా.ఎన్.ప్రభాకర రెడ్డి అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయి మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ యస్.వి.మాధవ్ రెడ్డి అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో సంతలు జరిగే ప్రదేశాలు, షాపులు వద్ద మత్తు పదార్ధాల విక్రయించే వారి వివరాలు అందజేసేలా నిఘా వ్యవస్థను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. గంజాయి, నాటు సారా వంటి మత్తు పదార్థాలు, బాల్య వివాహాలు, మహిళల అక్రమ రవాణా వంటి వాటిపై అధికారులు సమన్వయం చేసుకొని ప్రజలకు అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే రవాణా, అటవీ, ఆర్.టి.సీ, ఎక్సయిజ్ తదితర శాఖల ద్వారా నిర్వహిస్తున్న అవగాహన ర్యాలీలు, చైతన్య కార్యక్రమా లను, దాడుల్లో పట్టుకున్న సరుకుల వివరాలను తమకు, పోలీస్, సబ్ కలెక్టర్లకు ఎప్పటికప్పుడు తెలియజేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామంలో జరిగిన విషయాలకు స్థానిక సర్పంచ్ బాధ్యత వహించాల్సి ఉంటుందన్న విషయాన్ని వివరించాలని అన్నారు. ఎస్‌పి మాధవరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో మత్తు పదార్ధాల కట్టడికి చేపడుతున్న కట్టుదిట్టమైన చర్యలను కలెక్టర్‌కు వివరించారు.

మహిళలపై నేరాలు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలి

జిల్లాలో మహిళలపై వరకట్న, లైంగిక, ఇతర వేధింపులు, నేరాలు లేకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఎన్.ప్రభాకర రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. వరకట్న నిషేధ చట్టం – 1961 , మిషన్ శక్తి కార్యక్రమాలపై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత మూడేళ్లలో వరకట్న, ఇతర లైంగిక వేధింపుల కేసులు తగ్గుముఖం పట్టాయన్నారు. జిల్లాలో ఎటువంటి వేధింపుల కేసులు లేకుండా ఉండాలని, అన్ని శాఖలు సమన్వయంతోనే అది సాధ్యం అవుతుందని తెలిపారు. జిల్లా ఎస్పీ ఎస్‌వి మాధవ్ రెడ్డి మాట్లాడుతూ పోక్సో కేసులు నమోదు అవుతున్నాయని, ఇటీవలే ఒక పోక్సో కేసు నమోదైనట్లు చెప్పారు. పార్వతీపురం, పాలకొండ, సాలూరులో మూడు శక్తి బృందాలు ఏర్పాటు చేయబడ్డాయన్నారు. ఈ బృందాలు మహిళలపై నేరాల గురించి ఎక్కువ అవగాహన కల్పిస్తారని చెప్పారు. జనసమ్మర్ధం ఎక్కువగా ఉండే ప్రాంతాలలో శక్తి బృందాలు, స్థానిక పోలీసు సిబ్బంది ఎగుడ్ టచ్ అండ్ టచ్, పోక్సో చట్టం, మహిళలకు సంబంధించిన నేరాలు, బాల్య వివాహాలు, అత్యవసర సంప్రదింపు నంబర్లు (112.181.1930, 1098) మొదలైన వాటిపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఐసిడిఎస్ పిఒ టి.కనకదుర్గ జిల్లాలో వరకట్న నిషేధ చట్టం, మిషన్ శక్తి కార్యక్రమాల అమలుపై కలెక్టరుకు వివరించారు. సమావేశంలో జెసి సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి, డిఆర్‌ఒ కె.హేమలత, సబ్ కలెక్టర్లు ఆర్.వైశాలి, పవార్ స్వప్నిల్ జగన్నాథ్, డీఎస్పీ ఎం.రాంబాబు, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ ఎ.సంతోష్, డిఇఒ బి.రాజకుమార్, జిల్లా రవాణా అధికారి టి.దుర్గాప్రసాద్, జిల్లా ప్రజా రవాణా అధికారి పి.వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహిళల ఆరోగ్యం కీలకం : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

ప్రతి కుటుంబం సురక్షితంగా, ఆరోగ్యంగా ఉండాలంటే మహిళల ఆరోగ్యం అత్యంత కీలకమని రాష్ట్ర స్త్రీ, శిశుసంక్షేమ, గిరిజన సంక్షేమశాఖా మంత్రి జి.సంధ్యారాణి అన్నారు. పట్టణంలోని ఆరో వార్డు దాసరివీధి లోని సీతారామ కళ్యాణ మండపంలో శుక్రవారం నిర్వహించిన సఖి సురక్ష హెల్త్ స్క్రీనింగ్ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళల ఆరోగ్య పరిరక్షణను దృష్టిలో ఉంచుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని మహిళలు ఆరోగ్య పరీక్షలు క్రమం తప్పకుండా చేయించుకోవాలన్నారు. గ్రామీణ, గిరిజన ప్రాంతాల మహిళలకు సమగ్ర వైద్య సేవలు అందించేందుకు ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో మహిళలకు రక్తపోటు, షుగర్, హీమోగ్లోబిన్ స్థాయిలు, రక్తపరీక్షలు, స్తన క్యాన్సర్, గర్భాశయ సంబంధిత క్యాన్సర్ ప్రాథమిక స్క్రీనింగ్ పరీక్షలు వైద్య నిపుణుల పర్యవేక్షణలో నిర్వహించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, వైద్య అధికారులు, మహిళా సంఘాల ప్రతినిధులు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.



సఖి సురక్ష సెంటర్‌ను ప్రారంభిస్తున్న మంత్రి సంధ్యారాణి

పార్వతీపురం టౌన్ : జిల్లా కేంద్రంలో శుక్రవారం నాడు పట్టణంలో ఉన్న స్థానిక విజయలక్ష్మి కళ్యాణ మండపంలో ప్రభుత్వం చేపట్టిన సఖీ సురక్ష కార్యక్రమాన్ని మెప్మా ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలకు ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళల ఆరోగ్యపరిరక్షణతో పాటు వారి ఆర్థిక ప్రగతికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని వెల్లడించారు. సఖిసురక్ష కార్యక్రమాన్ని మహిళలంతా సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎం.తేజోవతి మెప్మా ఇన్చార్జి పిడి కృష్ణారావు, సిఎంఎం పుష్ప, సిఒలు ప్రశాంతి, ఈశ్వరరావు, అధికారులు, సిబ్బంది, డాక్టర్లు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.



డిఇఒకు వినతిని అందజేస్తున్న ఫ్యాప్టో నాయకులు

ఇన్ సర్వీస్ టీచర్లకు మినహాయింపు ఇవ్వాలి

ప్రజాశక్తి - పార్వతీపురం

ఇన్ సర్వీస్ టీచర్లకు టెట్ నుంచి మినహాయింపు ఇవ్వాలని కోరుతూ కేంద్ర ప్రభుత్వానికి విద్యాహక్కు చట్టంలో సవరణలు తీసుకొచ్చేలా రాష్ట్ర ప్రభుత్వం కోరాలని ఫ్యాప్టో జిల్లా నాయకులు జిల్లా విద్యాశాఖాధికారి రాజ్‌కుమార్‌కు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. దీనిపై సుప్రీంకోర్టులో రాష్ట్ర ప్రభుత్వం తరపున రివ్యూ పిటిషన్ వేయాలని డిమాండ్ చేశారు. టిటిసి, బిఇడి, ఎంఇడి కోర్సులు పూర్తి చేసి ఉపాధ్యాయులుగా చేరిన వారికి మళ్లీ టెట్ అవసరం లేదని చెప్పారు. కొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికే ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వానికి లేఖలు రాయగా, ఎపి ప్రభుత్వం కూడా అదేబాటలో కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఫ్యాప్టో జిల్లా చైర్మన్ పి.కూర్మినాయుడు, జిల్లా కో చైర్మన్, యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె భాస్కరరావు, కో-చైర్మన్ యు గోవిందరావు, జిల్లా డిప్యూటీ సెక్రటరీ జనరల్ బి నర్సింగరావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి కె.మురళీ పాల్గొన్నారు.

బోట్ షికారు ఏర్పాట్లపై సమీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురం

తోటపల్లి ఉద్యానవన పార్కులో బోట్ షికారు ఏర్పాటుపై జాయింట్ కలెక్టర్ సి.యశ్వంత్ కుమార్ రెడ్డి సంబంధిత అధికారులతో శుక్రవారం ఆయన ఛాంబరులో సమీక్షించారు. ఇప్పటికే పార్కును అభివృద్ధి చేసి అన్ని మౌలిక వసతులు కల్పించడం జరిగింది. పర్యాటకులను మరింత ఆకర్షించేలా బోట్ షికారు ఏర్పాటుకు ఎపి టూరిజం బోట్ కంట్రోల్ రూమ్ యూనిట్ మేనేజర్, విశాఖ రుషికొండ ఎఇలతో జెసి మాట్లాడారు. బోటు షికారు పునః ప్రారంభానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ సమీక్షలో ఐటిడిఎ ఎపిఒ ఎ.మురళీధర్, టూరిజం బోట్ కంట్రోల్ రూమ్ యూనిట్ మేనేజర్, ఋషికొండ ఎఇ, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పంటనష్టాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే

ప్రజాశక్తి - వీరఘట్టం

తుపాను తీవ్రత వల్ల క్యాబేజీ, వరి పంటలకు నష్టం వాటిల్లడంతో స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ శుక్రవారం పరిశీలించారు. మండలంలోని తూడి, కొట్టుగుమ్మడ, గడగమ్మ గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పంట నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారమందేలా తన వంతు కృషి చేస్తానని రైతులకు భరోసా ఇచ్చారు. పంటలను పరిశీలించి నివేదికలు తయారు చేయాలని, వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు పి.కృష్ణమూర్తి నాయుడు, ఉదయాన ఉదయ భాస్కర్, జామి లక్ష్మీనారాయణ,బల్ల హరిబాబు, చింత ఉమామహేశ్వరరావు, రైతులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో పోలీసుల ర్యాలీ

ప్రజాశక్తి - సాలూరు

పోలీసు అమరుల వారోత్సవాల సందర్భంగా శుక్రవారం స్థానిక బోసు బొమ్మ జంక్షన్ నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు కొవ్వొత్తుల ర్యాలీ చేపట్టారు. పట్టణ, రూరల్ సిఐలు బి.అప్పలనాయుడు, పి.రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీలో పోలీసులు, విద్యార్థులు పాల్గొన్నారు.

గ్రామాల్లో మలేరియా పరీక్షలు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మా ఊరికి మలేరియా వచ్చింది కార్యక్రమంలో భాగంగా మండలంలోని తాడికొండ పిహెచ్‌సి పరిధిలో గల గ్రామాల్లో వైద్యులు అఖిలాష్ గిరిజనులకు మలేరియా పరీక్షలు నిర్వహించారు. మలేరియా రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, దోమల నియంత్రణ చర్యలపై అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లో నీటి నిల్వ లేకుండా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంటిఎస్ జి.కేశవరావు, మండల పరిషత్, వైద్య సిబ్బంది ఉన్నారు.

పాలకొండను జిల్లా చేయాలని రిలే దీక్షలు

ప్రజాశక్తి - పాలకొండ

పాలకొండ పాత రెవెన్యూ డివిజన్‌ను జిల్లా చేయాలని, లేనిచో శ్రీకాకుళం జిల్లాలో కలపాలని కోరుతూ జిల్లా సాధన సమితి ఆధ్వర్యంలో కోట దుర్గ ఆలయ ఆవరణలో శుక్రవారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. పాలనా సౌలభ్యం కోసం జిల్లాల పునర్విభజన చేస్తున్న నేపథ్యంలో పూర్వపు డివిజన్‌ను ఒక జిల్లాగా చేయాలన్నారు. లేకుంటే శ్రీకాకుళంలో చేర్చాలని నాయకులు కోరారు. ఈ దీక్షా శిబిరంలో సాధన సమితి గౌరవాధ్యక్షులు బసవల చౌదరి నాయుడు, సాధన సమితి కోశాధికారి సబ్బా నానాజీ, జనార్ధనరావు, తదితరులు పాల్గొన్నారు. దీక్షా శిబిరానికి హాజరైన నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ పడాల భూదేవి మాట్లాడుతూ ఈ సమస్యను సిఎం దృష్టికి తీసుకెళ్తున్నారు. కార్యక్రమంలో పట్టణ వైసిపి అధ్యక్షుడు వెలమల మన్మధరావు, కొన్నింటి కడగల రవణ, శంకర్రావు, బాసూరు కాంతారావు, గువ్వల రమేష్ బాబు, శర్వారావు రామకృష్ణ, గుమ్మడి సింహాద్రి తదితరులు ఉన్నారు.

డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం డంపింగ్ యార్డ్ సమస్యకు పరిష్కారం చూపిస్తున్నట్లు స్థానిక ఎమ్మెల్యే విజయ్ చంద్ర తెలిపారు. డంపింగ్ యార్డ్ వద్ద వ్యర్థాల రీసైక్లింగ్ చేసే యూనిట్లను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొన్ని దశాబ్దాలుగా పేరుకుపోయిన చెత్తను సంపదగా మార్చనున్నట్లు వివరించారు. తడుకే ఏజెన్సీ చెత్తను రీసైక్లింగ్ చేసే చర్యలు చేపట్టిందన్నారు. డంపింగ్ యార్డ్ సమస్య త్వరలోనే పూర్తిగా పోతుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి శ్రీనివాసరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ కె.పకీరు రాజు, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఫ్రైడే డ్రైడే

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని 24 సచివాలయాల పరిధిలో ప్రత్యేక అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం ఫ్రైడే, డే డ్రై కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లో సందర్శించి కాలువల్లో చెత్తను తొలగించి బ్లీచింగ్ పౌడర్ చల్లారు. కార్యక్రమంలో సచివాలయాల కార్యదర్శులు, ఎఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న సొమ్ము అందజేత

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

మండలంలోని తాటిశీల గ్రామానికి చెందిన కద్రక సోమేశ్వరరావు పోగొట్టుకున్న రూ.లక్ష 32వేలు నగదును సర్పంచి బొత్తాడ గౌరీ శంకర్ రావు అందించి శభాష్ అనిపించుకున్నారు. సోమేశ్వరరావు ఇటీవల ఆర్థిక అవసరాల కోసం వెళ్లి గురువారం గుమ్మలక్ష్మీపురం వచ్చారు. పనిచేసి కష్టపడి సంపాదించుకున్న జీతం డబ్బులు జేబులో నుంచి పడిపోయాయి. స్వగ్రామం తాటిశీల ఇంటికి వెళ్లి చూసేసరికి డబ్బులు కనిపించకపోవడంతో ఆందోళన చెందాడు. ఈ విషయం సర్పంచ్‌కు తెలియజేయగా జరిగినదంతా విని ఆ సొమ్ము ఎవరికి దొరికిందో ఆరా తీశారు. ఈ మేరకు బాధితునికి శుక్రవారం అందించారు.

విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

ప్రజాశక్తి - వీరఘట్టం

మండలంలోని నర్సిపురం మోడల్ ప్రైమరీ పాఠశాల విద్యార్థులకు శుక్రవారం సెమిస్టర్ 2 పాఠ్యపుస్తకాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యాయ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి విశేష స్పందన

ప్రజాశక్తి - పాలకొండ

పోలీసు అమరుల వారోత్సవాల్లో సందర్భంగా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో నిర్వహించిన రక్తదాన శిబిరానికి విశేష స్పందన లభించింది. 104 మంది దాతలు రక్తం దానం చేశారు. అందులో పోలీసులు కూడా భాగస్వామ్యమయ్యారు. ఈ సందర్భంగా రక్తదాన శిబిరాన్ని డిఎస్‌పి ఎం.రాంబాబు ప్రారంభించి మాట్లాడారు. రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలన్నారు. ఎస్‌పి సూచనల మేరకు ఈ శిబిరాన్ని ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సిఐ ఎ.ప్రసాదరావు, ఎస్సైలు పాల్గొన్నారు.

విద్యుత్ శాఖపై నిప్పులు చెరిగిన సర్పంచులు

వాడీవేడిగా మండల సర్వసభ్య సమావేశం



సభ్యుల సమస్యలకు సమాధానం ఇస్తున్న విద్యుత్‌శాఖ ఎఇ

ప్రజాశక్తి - సాలూరు

గ్రామాల్లో విద్యుత్ సమస్యలు అధికంగా ఉన్నాయని, ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లోని విద్యుత్ సరఫరా వైఫల్యంపై సంపంగిపాడు, తోణాం సర్పంచ్‌లు చంద్రరావు, సర్పంచ్ అదయ్య విద్యుత్ ఎఇని నిలదీశారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిపి జి.రాములమ్మ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం వాడీవేడీగా జరిగింది. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారుల పనితీరుపై సర్పంచులు, ఎంపీటీసీలు తీవ్ర స్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేశారు. తొలుత జరిగిన విద్యుత్‌శాఖ పనితీరుపై సభ్యులు మాట్లాడుతూ ఇళ్ల మీదుగా ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ తీగెలను పట్టించుకోరా? కరెంటు అంతరాయం ఏర్పడితే, దాన్ని బాగు చేయడానికి మూడు రోజులు సమయం ఎందుకు తీసుకుంటున్నారు? గిరిజనులు పడుతున్న ఇబ్బందులు కనిపించడం లేదా? సచివాలయ జెఎల్‌ఎంలకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదంటూ సర్పంచ్ లు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి ఎఇ మాట్లాడుతూ ఏ గ్రామంలోనైనా వైర్లు వేలాడినా, స్తంభాలు వరిగినా తక్షణమే జెఎల్‌ఎంలు పనిచేయాల్సి ఉంటుందని, అలా చేయని వారిపై చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కొండ ప్రాంతాలలో పనుల నిమిత్తం వెళ్ళడానికి ఎదురవుతున్న ఇబ్బందుల వల్ల మరమ్మతులకు మూడు నుంచి నాలుగు రోజుల సమయం పడుతోందని ఆయన వివరణ ఇచ్చారు. ఇటీవల సంభవించిన తుపానుకు మండలంలో పంట నష్టం జరిగిన నేపథ్యంలో వ్యవసాయ శాఖ అధికారిణి శిరీష పంట కొనుగోలు కేంద్రాలు, నష్ట పరిహారంపై మాట్లాడారు. మండలంలో 8 ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని, ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరకు రంగు మారిన ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, తుఫాను వల్ల నష్టపోయిన ప్రతి రైతు పొలానికి సిబ్బంది వెళ్లి నమోదు చేస్తారని,వారికి నష్ట పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. దీనికి వైస్ ఎంపీపీ రెడ్డి సురేష్ జోక్యం చేసుకుని పూర్తిగా పంట పోయిన వారికే నష్ట పరిహారం ఇస్తారా? కొద్ది కొద్దిగా నష్టం జరిగిన రైతులకు పరిహారం అందజేయరా అని ప్రశ్నించారు. గిరిజన ప్రాంతాల్లో తాగునీటి సమస్యపై సర్పంచ్‌లు వివరణ కోరగా, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ గౌస్ సమాధానమిస్తూ నిధులు రాగానే మంచినీటి పథకాలకుక రిపేర్లు చేయించి, ప్రతి ఒక్కరికీ మంచి నీటి సదుపాయం కల్పించేలా కృషి చేస్తామనిహామీ ఇచ్చారు.

సర్పంచుల గౌరవంపై రగడ : ఎపిఒను నిలదీసిన ప్రజాప్రతినిధులు

అభివృద్ధి పనుల విషయంలో స్థానిక ప్రజాప్రతినిధులను విస్మరించడంపై సమావేశంలో తీవ్ర చర్చ జరిగింది. పెదపదం సర్పంచ్ సుకన్య ఎపిఒ కృష్ణారావును నిలదీస్తూ స్థానిక సర్పంచ్‌లకు తెలియకుండా గ్రామాల్లో పనులు ఎలా చేస్తారని, అభివృద్ధి పనుల కోసం తీర్మానాలు ఎలా జరుగుతాయని ప్రశ్నించారు. ఇదే విషయమై పురోహితునివలస, జీగిరాం, పారన్నవలస సర్పంచ్‌లు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. అధికార పార్టీ నాయకులకు వత్తాసు పలుకుతూ పనులు గుర్తించి, మీకు నచ్చిన విధంగా చేసుకుంటే ఇక సర్పంచ్‌లు ఎందుకని? దీని వల్ల తమకు ఏ విధంగా విలువ ఇచ్చినట్లు అవుతుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత మూడు సమావేశాలుగా ఇదే సమస్యపై నిలదీస్తున్నా తీరు మారడం లేదని వారు వాపోయారు. దీనికి ఎంపిడిఒ పార్వతి స్పందిస్తూ సర్పంచులకు ప్రతి విషయాన్ని తెలియజేస్తున్నామని చెప్పినప్పటికీ, సర్పంచ్‌లు ఆ వివరణతో సంతృప్తి చెందలేదు. ఎంపిఒ మాట్లాడుతూ సర్పంచ్‌లతో కలిసే పనులను నిర్వహిస్తున్నామని, ఒక్క పెదపదం పంచాయతీలోనే ఈ సమస్య ఉత్పన్నమవుతోందని తెలిపారు. సర్పంచులు పీడీక సుదర్శన్ రావు, సూరప్పల నాయుడు, నూకయ్య మాట్లాడుతూ అభివృద్ధిని తాము అడ్డుకోమని, తమ వంతు సహాయ సహకారాలు అందిస్తామని, అయితే కనీసం సర్పంచ్‌లు ఉన్నారన్న ఆలోచనతో అధికారులు, అధికార పార్టీ నాయకులు వ్యవహరించినట్లయితేనే సభ సజావుగా సాగుతుందని, అభివృద్ధి కార్యక్రమాలకు తాము పూర్తి సహకారం అందిస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎఎంసి చైర్మన్ ముఖీ సూర్యనారాయణ, పలువురు ఎంపిటిసి సభ్యులు, సర్పంచులు, మండల అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలుపై శిక్షణ

ప్రజాశక్తి - సీతానగరం

స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ అధికారులు వీఆర్వోలకు ధాన్యం కొనుగోళ్లపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సివిల్ సప్లై అధికారులు లావణ్య మాట్లాడుతూ ఈ ఏడాది ఎ- గ్రేడ్ ధాన్యం రూ.2369కు కొనుగోలు చేస్తామన్నారు. తేమశాతం 17 కన్నా తన తక్కువ ఉండాలన్నారు ధాన్యం కొనుగోళ్లలో నాణ్యతను పాటించాలన్నారు. చెడిపోయిన, రంగు మారిన గింజలు ఐదు శాతం కన్నా తక్కువ ఉండాలని ఆమె అన్నారు. కార్యక్రమంలో ఎఒఎస్ అవినాష్, డిప్యూటీ తహశీల్దార్ వి.ఉమామహేశ్వరరావు, సివిల్ సప్లై అధికారులు ప్రశాంత్, వ్యవసాయ, రెవెన్యూ, సహకార సంఘాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఎఐటియుసి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

దేశంలోని అతి పురాతన కార్మిక సంఘాల్లో ఒకటైన ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి) 106వ ఆవిర్భావ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌విఎస్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కార్మికులు, ఉద్యోగులు, సానుభూతిపరులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి, ఎఐటియుసి చరిత్రను, కార్మిక ఉద్యమంలో దాని ప్రాధాన్యతను వివరించారు. కార్యక్రమంలో ఎఐటియుసి సభ్యులు పాల్గొన్నారు.

పటిష్టంగా 'ముస్తాబు' : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో ముస్తాబు కార్యక్రమం పటిష్టంగా అమలుకావాలని కలెక్టర్ డాక్టర్ ఎన్.ప్రభాకరరెడ్డి స్పష్టం చేశారు. ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు శ్రద్ధ పెడితే కార్యక్రమం తప్పనిసరిగా విజయవంతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ముస్తాబు కార్యక్రమం అమలుపై ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులతో కలెక్టర్ వీడియో సమావేశం ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యానికి ప్రధానమైన వ్యక్తిగత పరిశుభ్రత పట్ల అవగాహన కల్పించేందుకు ముస్తాబు అనే కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. విద్యార్థులతో పాటు ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులకు ఇది వర్తిస్తుందని తేల్చి చెప్పారు. వ్యక్తిగత పరిశుభ్రతను పాటిస్తే చాలా వరకు వ్యాధులు రాకుండా నివారించవచ్చని అన్నారు. అలాగే వారిలో శారీరక ధృఢత్వానికిఉదయం యోగా, సాయంత్రం ఆటలను ఆడించడం తప్పనిసరి అని పేర్కొన్నారు. ఇది ప్రభుత్వ పాఠశాలలకే పరిమితం కాదని, ప్రైవేట్ విద్యా సంస్థలు ఆచరించాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

శుభ్రతే ఆరోగ్యం... ఆరోగ్యమే ఆయుస్సు.. అదే "ముస్తాబు"

పిల్లల్లో పరిశుభ్రత, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను పెంపొందించేందుకు 'ముస్తాబు' అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందని అన్నారు. పాఠశాల తరగతి గదిలోకి విద్యార్థులు ప్రవేశించే ముందే వారి పరిశుభ్రతను తనిఖీ చేయడం ఈ కార్యక్రమంలో ప్రధాన అంశమని పేర్కొన్నారు. శుభ్రతను ధ్రువీకరించుకున్న తర్వాతే విద్యార్థిని తరగతి గదిలోకి అనుమతిస్తారని స్పష్టం చేశారు. అలాగే మధ్యాహ్న భోజనానికి ముందు కూడా విద్యార్థుల చేతులను, గోళ్లను శుభ్రంగా కడుక్కున్నారా లేదా అని తనిఖీ చేస్తారని, లేనివారు శుభ్రపరచుకున్న అనంతరం భోజనం అందిస్తారని అన్నారు. ఇది విద్యార్థులకే కాదని, హెచ్‌ఎంలకు, టీచర్లకు వర్తిస్తుందని వివరించారు. సమావేశంలో డిఇఒ బి.రాజ్ కుమార్, ప్రధాన ఉపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కోటి సంతకాల సేకరణలో 'అలజంగి' ముందంజ

ప్రజాశక్తి - పార్వతీపురం

రాష్ట్రంలో ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి చేపట్టిన కోటి సంతకాల ఉద్యమం నియోజకవర్గంలో జోరుగా సాగుతోంది. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన 17 వైద్య కళాశాలలను పిపిపి పద్ధతిలో ప్రయివేటీకరణ చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. దీన్ని నిరసిస్తూ మాజీ సిఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించాలని పార్టీ నాయకులకు పిలుపునిచ్చారు. దీనిలో భాగంగా పార్వతీపురం నియోజకవర్గంలో మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు నాయకత్వంలో సంతకాల సేకరణ ఉద్యమం చరమాంకానికి చేరుతోంది. నియోజకవర్గంలో 60వేల మంది సంతకాలు తీసుకోవాలని పార్టీ అధిష్టానం ఆదేశించింది. ఈ మేరకు బల్జిపేట, సీతానగరం, పార్వతీపురం మండలం, మున్సిపాలిటీల్లో సంతకాల సేకరణ కార్యక్రమాన్ని జోగారావు శరవేగంగా నిర్వహిస్తున్నారు. ఇప్పటికే ఈ మూడు మండలాల్లోని 34 గ్రామాల్లో, మున్సిపాలిటీల్లో 8 చోట్ల సంతకాల సేకరణ నిర్వహించారు. ఈ మేరకు పార్వతీపురం పట్టణంలో కలెక్టరేట్ ఎదురుగా మెయిన్ రోడ్ పక్కన సంతకాల సేకరణ శుక్రవారం చేపట్టారు. ప్రయివేటు వైద్య కళాశాలల వల్ల ఎదురయ్యే ఇబ్బందులు, ప్రభుత్వ వైద్య కళాశాలల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ఆయన సంతకాలు పెట్టించారు. ఇంతవరకు 50వేల సంతకాలు పెట్టించిన ఆయన పార్టీ నిర్దేశించిన లక్ష్యానికి చేరువలో వున్నారు. జిల్లాలోని నాలుగు నియోజకవర్గాల్లో ఆయనే ఈ కార్యక్రమంలో దూసుకుపోతున్న పరిస్థితి కనిపిస్తోంది.

మిగిలిన నియోజకవర్గాల్లో కానరాని ఉద్యమం

కోటి సంతకాల సేకరణ ఉద్యమం సందడి జిల్లాలో మిగిలిన నియోజకవర్గాల్లో పెద్దగా కనిపించడం లేదు. మాజీ డిప్యూటీ సీఎంలు రాజన్నదొర, పుష్పశ్రీవాణి నియోజకవర్గాల్లో కూడా మందకొడిగా సాగుతోంది.



ప్రయాణికుల నుంచి సంతకాలు సేకరిస్తున్న జోగారావు

సాలూరు, కురుపాం నియోజకవర్గాల్లో మండల నాయకులు ఈ కార్యక్రమాన్ని మొక్కుబడిగా నిర్వహిస్తున్నారనే వాదనలు వినిపిస్తున్నాయి. స్థానిక నాయకులు కూడా పెద్దగా ఆసక్తి చూపడం లేదు. పాలకొండ నియోజకవర్గంలో అయితే మాజీ ఎమ్మెల్యే వి.కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ వున్నారు.అయినా కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని ఉత్సాహంగా నిర్వహిస్తున్న దాఖలాలు లేవు.

కొద్ది రోజుల్లో సంతకాల సేకరణ పూర్తి: మాజీ ఎమ్మెల్యే జోగారావు

ప్రభుత్వ వైద్య కళాశాలల ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా వైసిపి అధినేత జగన్ మోహన్ రెడ్డి పిలుపునిచ్చిన కోటి సంతకాల సేకరణ ఉద్యమం నియోజకవర్గంలో పూర్తయ్యే దశకు చేరుకుంది. ఇంతవరకు నియోజకవర్గం లో 42 చోట్ల సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టాం. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటు పరం చేయడానికి వ్యతిరేకంగా ప్రజలు ఉత్సాహంగా సంతకాలు చేస్తున్నారు. నియోజకవర్గంలో ఇంతవరకు 50 వేల సంతకాలు చేయించాం. మరో పది వేల సంతకాలు చేయాల్సి ఉంది.



ఉపాధి సిబ్బందితో మాట్లాడుతున్న డ్వామా పీడీ రామచంద్రరావు

సామాజిక తనిఖీలో బయటపడ్డ దొంగ మస్తర్లు

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పలు గ్రామాల్లో చేపట్టిన ఉపాధిహామీ పనుల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు దొంగ మస్తర్లు వేసి నిధులు స్వాహా చేసినట్లు సామాజిక తనిఖీ బృందం గుర్తించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ చట్టం సామాజిక తనిఖీ ప్రజావేదిక డ్వామా పీడీ కె.రామచంద్రరావు అధ్యక్షతన జరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేసిన పనులకు సామాజిక తనిఖీ బృందం గత సెప్టెంబర్‌లో గ్రామాల్లో తనిఖీలు నిర్వహించి గ్రామసభలు జరిగాయి. వచ్చిన ఫిర్యాదులను ప్రజావేదికలో సామాజిక తనిఖీ బృందం చదివి వినిపించారు. 117 పనులకు రూ.31 కోట్లు నిధులు ఖర్చయినట్లు తెలిపారు. మండలంలోని 35 పంచాయతీల్లో జాబ్ కార్డుదారులకు గ్రామాల్లో ఉండే మేట్లు, ఫీల్డ్ అసిస్టెంట్ల సకాలంలో మస్తర్లు పంపకపోవడంతో పనికి వెళ్లని వారివి, వలసలు వెళ్లిపోయిన వారివి దొంగ మస్తర్లు నమోదు చేసినట్లు నిర్ధారణ అయింది. పాపంవలసకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ దొంగ మస్తర్లు వేసి రూ.82వేలు వేతన దారులకు చెల్లించినట్టు చూపారు. దీంతో ఆ ఫీల్డ్ అసిస్టెంట్‌ను నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు డ్వామా పీడీ రామచంద్రరావు తెలిపారు. అలాగే చిన్నంకలం ఫీల్డ్ అసిస్టెంట్ సత్యనారాయణపై వచ్చిన ఫిర్యాదులను మళ్లీ గ్రామంలో విచారణ జరపాలని ఎంపిడిఒ త్రివిక్రమరావుకు సూచించారు. జోగింపేటలో సామాజిక బృందం వారు తెల్ల కాగితాలపై సంతకాలు ఫిర్యాదులు ఇవ్వకపోయినా ఇచ్చినట్లు రాసుకున్నారని గ్రామస్తులు వారిపై సభా వేదిక వద్ద ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఎస్‌టియు గౌరీ శంకర్, ఎస్ఆర్‌పి సిహెచ్ రామచంద్రరావు, డిడిఇఒ వెంకటరమణ, ఎపిఒ బాలకృష్ణ ఎంపిపి బి.రవణమ్మ, జడ్పిటిసి ఎం.బాబ్జీ, ఎఎంసి వైస్‌చైర్మన్ వేణుగోపాలనాయుడు, సీతానగరం ప్రాజెక్ట్ నీటి సంఘం చైర్మన్ వెంకటప్పలనాయుడు, వివిధ గ్రామాల సర్పంచులు, ఎంపిటిసి సభ్యులు, టెక్నికల్ అసిస్టెంట్లు గ్రామస్తులు పాల్గొన్నారు.

రోడ్లకు మరమ్మతులు చేయాలి

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణ ప్రధాన రహదారుల్లో ప్రమాదకరమైన గుంతలు ఏర్పడ్డాయని, వాటివల్ల వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే మరమ్మతులు చేపట్టాలని సిఐటియు జిల్లా కోశాధికారి గొర్లి వెంకటరమణ డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక రాయగడ రోడ్డు శివారున ఏర్పడిన ప్రమాదకర రోడ్లను పరిశీలించారు. అనంతరం సిఐటియు పట్టణ కమిటీ ఆధ్వర్యంలో స్థానికులతో కలిసి రాస్తారోకో చేపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వెంకటరమణ మాట్లాడుతూ పట్టణ ప్రధాన రోడ్లు బెలగాం నుండి రాయగడ రోడ్డు చివరి వరకు, అలాగే బైపాస్ రోడ్డు, కొత్తవలస రోడ్లు చాలా అధ్వానంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధులు, జిల్లా ఉన్నతాధికారులు జిల్లా కేంద్రంలోని రోడ్లపై కనీసం దృష్టి సారించకపోవడం అన్యాయమని మండిపడ్డారు. రోడ్ల మరమ్మతులకై ప్రభుత్వం కేటాయించే నిధులు ప్రకటనలకే పరిమితమవుతున్నాయని, ఆచరణలో శూన్యమని విమర్శించారు. మంత్రుల పర్యటనలో అధికారులు కొండ బూడిదను వేసి చేతులు దులిపేసుకుంటున్నారని, దీనివల్ల వాతావరణ కాలుష్యం ఏర్పడి పాదచారులు అనారోగ్య బారిన పడే పరిస్థితి నెలకొంటుందని తెలిపారు.

సిఐటియు ఆధ్వర్యాన రాస్తారోకో



రాస్తారోకో చేస్తున్న సిఐటియు నాయకులు

చిన్న పాటి రోడ్ల మరమ్మతులను ప్రభుత్వం, అధికారులు పట్టించుకోకపోవడంతో ఇటీవల కురిసిన వర్షాలకు మరింత ప్రమాదకరంగా మారాయని, వెంటనే వాటికి మరమ్మతులు చేపట్టి రోడ్డు ప్రమాదాలను నివారించాలని కోరారు. లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి బంకురు సూరిబాబు, నాగరాజు, రాంబాబు, గోపి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత : మంత్రి

ప్రజాశక్తి - సాలూరు

కూటమి ప్రభుత్వం ప్రజల సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యతనిస్తోందని రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి అన్నారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రజా దర్బార్" కార్యక్రమాన్ని నిర్వహించి ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు తమ అర్జీలను సమర్పించారు. అనంతరం మంత్రి మాటాడుతూ అర్హులైన ప్రతి పేద కుటుంబానికి ప్రభుత్వం అందించే పథకాల ప్రయోజనాలు చేరేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ప్రతి ఒక్కరి సమస్య వేగంగా పరిష్కరించేందుకు అధికారులకు వెంటనే సూచనలు జారీ చేస్తున్నామని, ప్రజా సమస్యల పరిష్కారానికి ఎప్పుడూ అందుబాటులో ఉంటామని మంత్రివర్యులు స్పష్టం చేశారు.

గుమ్మలక్ష్మీపురం : ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించడమే ప్రజా దర్బార్ ముఖ్యో ఉదేశ్యమని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి అన్నారు. శుక్రవారం కేదారిపురంలో ప్రజా దర్బార్ నిర్వహించారు. ప్రజలు వినతులు రూపంలో అందించిన సమస్యలను పరిశీలించి సంబంధిత అధికారులతో చర్చించి పూర్తి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. నియోజకవర్గంలోని ప్రజలు విన్నవించిన ప్రతి సమస్యను తక్షణ పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ప్రజా సమస్యలు పరిష్కరించడానికి ఈ ప్రజా దర్బార్ నిర్వహిస్తామని, ఈ అవకాశాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు

ప్రజశక్తి - కురుపాం

ముంథా తుఫాన్ నేపథ్యంలో ఇటీవల కురిసిన వర్షాలకు పశువులు వ్యాధుల బారిన పడకుండగా ముందస్తుగా మండలంలో అన్ని గ్రామాల్లో పశు వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు పశు వైద్యాధికారి కె.శైలజ తెలిపారు. శుక్రవారం మండలంలో జరిగిన పశు వైద్య శిబిరాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటికే అనారోగ్యం బారిన పడిన పశువులకు వైద్యమందిస్తూ వ్యాధుల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రైతులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. పశు సంవర్ధక శాఖ ద్వారా ఇన్సూరెన్స్ ఉందని, కావున ప్రతి రైతు ఇన్సూరెన్స్ చేయించు కోవాల న్నారు. తుఫాను కారణంగా మరణించిన పశువులకు నష్టపరిహారం అందిస్తా మన్నారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ అఖిలేష్, పాడి రైతులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : మొంథా తుపాన్ కారణంగా మండలంలో పశువైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వైద్యులు పేకాపు లక్ష్మణరావు తెలిపారు. పశువులకు వ్యాధులు సోకకుండా రైతులు పశువులకు టీకాలు కోరారు. తుఫాన్ కారణంగా పశువులు మరణిస్తే ప్రభుత్వం నష్ట పరిహారం అందిస్తుందని తెలిపారు. పశుభీమా ఇన్సూరెన్స్ ఉందని ప్రతీ ఒక్క రైతు తమ పశువులకు చేయించుకోవాలని కోరారు.

కెజిబివిని సందర్శించిన ఎంపిడిఒ

మక్కువ : మండలంలోని కాశీపట్నంలో గల కెజిబివి పాఠశాలను ఎంపిడిఒ ఎన్.అర్జునరావు శుక్రవారం సందర్శించారు. పాఠశాలలో నలుగురు విద్యార్థినిలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న విషయాన్ని గుర్తించిన ప్రిన్సిపాల్ నాగదుర్గ వారి వివరాలను ఎంపిడిఒకు వివరించారు. కడుపు నొప్పితో బాధపడుతున్న కె.స్వాతిని తల్లిదండ్రుల అనుమతితో బొబ్బిలి ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. మిగిలిన బాలికల ఆరోగ్య పరిస్థితి అంతా బాగానే ఉందని మక్కువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించడం జరిగిందని ఆమె తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపిడిఒ సూర్యనారాయణ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

పట్టణంలో శనివారం ఉదయం 9 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్/ ఆపరేషన్/ పార్వతీపురం వారి ఆదేశాల మేరకు ఆర్‌డిఎస్ఎస్ స్కీం వర్క్స్‌లో భాగంగా పనులు జరుగుతాయని, దీంతో ఆయా సమయాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఎపి ఇపిడిసిఎల్ ఎఇ శుక్రవారం నాడు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11కెవి కొత్తవలస ఫీడర్, 11 కెవి గోపాలదాసుపేట ఫీడర్ పరిధిలో గల ఇందిరా కాలనీ, గంట వీధి, చిన్న మాదిగ వీధి, నిర్మల కాలనీ, దేవాంగుల వారి, వీధి బంధం వారి వీధి, టౌన్ పోలీస్ స్టేషన్ రోడ్డు, బరాటం వీధి, కంకటి వీధి, నెయ్యిల వీధి, బోటు వీధి, పాత బస్టాండ్, దంగిడి వీధి, అమ్మి గారి కోనేరు, ఎస్ ఎన్ ఎం నగర్, దుర్గ గుడి రోడ్డు, తూర్పు వీధి, కాకర్ల వీధి, గడి వీధి, కొత్త వీధి, రాయగడ రోడ్, వెంకటేశ్వర కాలనీ, గాసి వీధి, పరమేశ్వరి నగర్, జట్టాశ్రమం, సూర్యా పీఠం వరకు, కొత్తవలస మెయిన్ రోడ్, మణికంఠ కాలనీ, సాయిరాం కాలనీ నవిరి, గిజబా కాలనీ ఏరియా వరకు విద్యుత్ సరఫరా ఉండదనీ, పట్టణ ప్రజలు ఈ అంతరాయానికి సహకరించాలని కోరారు.

పి.లేవిడిలో పారిశుధ్య కార్యక్రమాలు

కురుపాం : మండలంలో పి. లేవిడిలో పంచాయతీ కార్యదర్శి ఎం.షర్మిల, సర్పంచ్ ఎన్.కవిత శుక్రవారం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముంథా తుఫాన్ నేపథ్యంలో కురిసిన వర్షాలకు కాలువల్లో నిండిన చెత్తాచెదారం, పూడికలను తీయించి పారిశుధ్య లోపం లేకుండా చర్యలు చేపట్టామన్నారు. అలాగే అన్ని తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయించి ప్రజలకు వేడినీరు తాగాలని సూచించి వ్యాధుల బారిన పడకుండా ముందస్తు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించామన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

స్థానిక ఎన్నికలకు సిద్ధం కండి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు మండల స్థాయి నాయకులు సన్నద్ధం కావాలని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి ఆదేశించారు. మండలంలోని కేదారిపురంలో శుక్రవారం స్థానిక ఎన్నికల సమర శంఖారావాన్ని ఆమె పూరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జరగబోయే స్థానిక ఎన్నికల గెలుపునకు కూటమి నాయకులు ఇప్పటి నుంచే కష్టపడి పని చేయాలని సూచించారు. సూపర్ సిక్స్, సూపర్ జిఎస్టి - సూపర్ సేవింగ్ గురించి విస్తతంగా ప్రజలకు తెలియజేయాలన్నారు. మండలంలోని ప్రతి పంచాయతీ కేంద్రంలో కూటమి అభ్యర్థులు గెలిచేలా నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చెయ్యాలని అన్నారు. సమావేశంలో కురుపాం ఎఎంసి చైర్మన్ కడ్రక కళావతి, రాష్ట్ర ఎస్టి కమిషన్ సభ్యులు కడ్రక మల్లేశ్వరరావు, మండల టిడిపి అధ్యక్షులు అడ్డాకుల నరేష్, బిజెపి ఎస్టి మోర్చా జిల్లా అధ్యక్షులు నిమ్మక సింహాచలం, బిజెపి మండల అధ్యక్షులు కడ్రక అప్పలస్వామి, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు మండంగి భూషణ్ రావు, మాజీ కన్వీనర్ పాడి సుదర్శన్ రావు, డుమ్మంగి సర్పంచ్ పాలక క్రాంతి కుమార్, మాజీ ఎంపిపి తాడంగి లక్ష్మణరావు, నాయకులు వెంకట్రావు, బుజ్జేశ్వరరావు, రామకష్ణ, రామారావు, చిన్న, ప్రసాద్, దామోదర్, రామారావు, రాజు, కొండలరావు, వెంకట్రావు, సాంబమూర్తి, కామేష్, జయంత్, గుంజన్న, దాసు, ధర్మ, హితీష్, రాజు, మనోహర్, నాగమణి, కళావతి, శాంతి కుమారి, కోటి, సోమారావు, మురళి పాల్గొన్నారు.